# 5. గాలిలో దీపం !

"అమ్మా... నేను కూడా రేపు మీతో పాటు చేనికి వస్తానే!" ఎనిమిదేళ్ళ రమేషు గారాలు పోతూ తల్లి రత్తమ్మని అడిగాడు.

"అట్నే వద్దువులే" తల్లి రత్తమ్మ అంది.

"వాడు ఎందుకే చేనికి? వాడు ఏం చేస్తాడు? నువ్వెందుకురా చేనికి?" తల్లి మీదా, తమ్ముడి మీదా ఒకేసారి కోపం వెళ్ళగక్కుతూ పధ్నాలుగేళ్ళ సురేషు అన్నాడు.

"నీ కెందుకయ్యా? నా ఇష్టం. నేను చేనికి వస్తా. నీదేందీ?"

"నువ్వు చేనికి వస్తే మరి బడి?"

"ఒరేయ్... మీరు ఇప్పుడే కొట్టుకోవాకండి. బడికి పోకపోతే ఏం పోయిందిలే, ఒక రోజులోనే చదివేదంతా మల్లబడి పోయిందేంది? అందరం పోదాంలే గనీ గోల చేయవాకండి!"

"నేను కూడా రేపు బాయి దగ్గిర టెంకాయ కొడతానే!"

"సరేలే"

"అమ్మా... రేపు చేలో దేవుడి బువ్వ వండుతావుగా...మరి పాలు?"

"విసిగిచ్చకుండా పొడుకో! పొద్దుబోయింది. ఏకుంజామునే లేవాలి!"

"పొద్దున్నే బర్రెని కూడా తోలుకుని పోతుండా చేనికి! చేలోనే పాలు పిండుకోవచ్చు" సురేషు చెప్పాడు.

"పొద్దున్న నాన బండి కట్టుకుని వస్తాడుగా?"

"వస్తాళ్ళే, పొడుకో!" రత్తమ్మ విసుక్కుంది.

"బండి రేపు నేను తోల్తా! చర్నాకోలు తీసుకుని ఎద్దుల్ని అదిలిస్తా!"

"అదిలిస్తావు, ఎలపటి ఎద్దుయవారం తెలియదు గామాలి, ఎత్తికుదేసిద్ది!" సురేషు అన్నాడు.

రత్తమ్మ పడుకొమ్మని గదమడంతో మౌనంగా పడుకుని, ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడెప్పుడు చేలోకి పోదామా అని ఉత్సాహంగా ఎదురు చూస్తూనే నిద్రలోనికి జారుకున్నారు అన్నదమ్ములిద్దరూ.

* * *

కోళ్ళు కూయకముందే రత్తమ్మ నిద్రలేచి ఇంట్లో పని పూర్తి చేసుకుంది.

తెల్లవారుతుండగా భర్త బసవయ్య ఎద్దుల బండి కట్టుకుని వచ్చాడు.

"సోమయ్యని కూడా పిలుచుకుని రాక పొయ్యా, ఒకేసారి కలిసిపోవచ్చు!"

"సైకిలు వేసుకుని వస్తాడంటలే, మనల్ని పొమ్మన్నాడు.మనం అదిగో ఇదిగో అని చేలోకి పోయేసరికి వస్తాడు!"

"ఇంజను సాగిచ్చటం నీకు తెలియదాయె! వచ్చి ఎట్ట సాగిచ్చాలో, ఎట్ట ఆపెయ్యాలో చెప్పి ఈ పూటకి ఉంటే తరువాత మన తంటాలు మనం పడొచ్చు! మళ్ళీ మంచి గడియ మించి పోయిద్ది!"

"వస్తాడు లేవే, సైకిలు మీద ఎంతసేపుట్లో వస్తాడు. మీరు కానియ్యండ్రా పోదాం!" బసవయ్య పిల్లల్ని తొందర చేశాడు.

పిల్లలు బియ్యం, కొబ్బరికాయలు, వంటపాత్రలు ఉన్న మూటలు తీసుకువచ్చి బండిమీద వేశారు.

"నేను బర్రెని తోలుకొని వస్తాను కానీ, మీరు పదండి"

"మళ్ళీ దాని యెనికీడితి నడిచిరాటం ఎందుకే! బండికి కడితే అదే వచ్చిద్దిలే!" అని బసవయ్య బర్రెని బండి వెనుక పలుపుతాడుతో కట్టాడు.

పిల్లలూ, రత్తమ్మా బండి ఎక్కి కూర్చున్నారు.

"గట్టిగా కూసోండ్రేయ్... పడతారు!" పిల్లల్ని హెచ్చరించాడు. ఎద్దుల గంటల గణగణ మోతలతో బండి కదిలింది.

* * *

బసవయ్య చిన్న రైతు.

రెండు ఎకరాలా ఇరవై సెంట్లు పొలం ఉంది. ఎద్దులూ, టైరు బండీ, అరక సామాన్లూ ఉన్నాయి.

తన పొలంలో పనిచేసుకుంటూ బాదుగకు తోల్తాడు. ఇద్దరు పిల్లలు - సురేషూ, రమేషూ.

పెద్దపిల్లవాడు సురేషు నాలుగోతరగతిలో చదువు మానుకుని, బరిగొడ్లు దగ్గరకి పోతున్నాడు. మేత కోయడం, పశువులకి నీళ్ళు తీసుకురావడం, ఉదయమే పొలానికి తండ్రి వెళ్తే అన్నం కేరేజీ తీసుకుపోవడం - ఇలా చాలా పనుల్లో తండ్రికి సాయపడుతున్నాడు. చిన్నవాడు రమేషు. ఎనిమిదేళ్ళు. రెండో తరగతి.

భార్య రత్తమ్మ పొలంలో పనిచేసుకుంటూ, కూలిపనులకి కూడా పోతుంది.

పొలంలో కంది, పెసర, మొక్కజొన్న ఇలాంటి పంటలు పండిస్తుంటారు. ఈ పంటల్లో పెద్దగా ఆదాయం ఉండేది కాదు. ఏడాది పొడుగునా చాకిరీ చేసుకుంటే నాలుగైదు వేలు మిగలడం గగనం, అదీ కాలం బాగుందనుకున్న ఏడు!

ఈ తక్కువ పొలం మీద ఎంతకాలం రెక్కలుముక్కలు చేసుకున్నా, ఎంత తపనపడి పాకులాడినా చివరికి తినేదేమీ ఉండదనే విషయం బసవయ్యకి అనుభవంలో బాగా తెలిసివచ్చింది.

తనకి చదువు లేదు. పొలంలో చాకిరీ తప్ప మరో విషయం తెలియదు. ఒంట్లో చేవ ఉంది. కొండని అయినా పిండి చేయగల సత్తా ఉంది. పొలంలో రసం పిండాలి! తను పిండగలడు!

కానీ, ఉన్నదేమో తక్కువ పొలం. ఈ తక్కువ పొలంలోనే ఎక్కువ పండించి, ఎక్కువ ఆదాయం పొందాలి.

ఎలా?

మెట్ట అయితే లాభం లేదు. నీటి సౌకర్యం ఉండాలి.

ఊళ్ళో ఎనిమిది వ్యవసాయబావులు ఉన్నాయి. ఆ బావుల కింద కూరగాయలు పండిస్తున్నారు. కూరగాయల మీద కుదిరితే ఎకరాకి అరవై డెబ్బయ్ వేలు కూడా మిగలవచ్చు!

తను కూడా కూరగాయలు పండిస్తేనే నాలుగు రూపాయలు కళ్ళచూడగలడు!

ముందు బావి తవ్వించాలి!

అనుకున్నదే తడవుగా ఊళ్ళో బావులు తవ్వించి కూరగాయలు పండించేవాళ్ళ దగ్గరికి సలహా కోసం వెళ్ళాడు.

"కూరగాయలు వేసుకుంటే వరస కుదిరితే డబ్బే డబ్బురా! తిరుగుడుబడితే మొదటికే మోసం కూడా రావచ్చు! జాగర్తగా చేసుకుంటే దండగ వచ్చే పనిలేదులే!" అని చెప్పారు వాళ్ళు.

బసవయ్య దగ్గర 15 వేలు ఉన్నాయి. ఇంకా 15 వేలు అప్పుచేస్తే బావీ, ఇంజనూ రెండూ సమకూరతాయి.

భార్యవద్ద నాలుగు సవర్ల గొలుసు ఉంది. అది తీసుకుపోయి బ్యాంకులో పెడితే ఎనిమిదివేలు వస్తాయి. కొరవ డబ్బు దొరకడం తనకి సమస్యకాదు.

ముందుగా చూసి పెట్టుకోవడం మంచిదని స్నేహంగా ఉండే ఇద్దర్ని అడిగాడు.

"కానివ్వరా బసవయ్యా... తవ్వించుకో బావి. ఎంత కావాలంటే అంత ఇస్తాం!" అన్నారు వాళ్ళు.

కార్యరంగంలోనికి దిగాడు. కూలీలు బావి తవ్వడం ప్రారంభించారు.

14 అడుగుల లోతు తవ్విన తరువాత బావిలో రాయి పడింది. బసవయ్య గుండెల్లో రాయిపడినట్లు బాధపడ్డాడు.

"పెద్ద సట్టే పడింది బసవయ్యన్నా! గడ్డపారయేస్తే దిగడంలా!" అన్నారు కూలీలు.

పేలుడు మందుపెట్టి బండ రాయిని పేల్చి తీయడానికి 8 వేలు ఖర్చయింది. అది అదనపు ఖర్చు! అనుకోని ఖర్చు!

అయితేనేం...

రాతి కింద బంగారం లాంటి జల! బావి ఉప్పొంగింది!

నీటిని చూసిన బసవయ్య హృదయం కూడా ఆనందంతో ఉప్పొంగిపోయింది.

నీరు తోడి బావి చుట్టూ రాతికట్టడం కూడా కట్టించాడు.

అంతకు ముందు ఏడాది ఊళ్ళో రామ్మూర్తి అనే అతను ఎకరా వంగతోట వేస్తే ఖర్చులు పోయి 80 వేలు మిగిలాయి. అంతకుముందు రెండేళ్ళు కూడా అతనికి వంగతోట మీద బాగానే డబ్బులు వచ్చాయి.

తను కూడా ఒక ఎకరం వంగతోట వేయాలి.

రామ్మూర్తితో కలిసి టౌనుకి వెళ్ళి, రామ్మూర్తికి తెల్సిన షాపులో విత్తనాలు కొనుక్కువచ్చి నారు పోశాడు.

రోజూ ఉదయమే వచ్చి బావినించి నీళ్ళుతోడి వంగమడి తడుపుకోవడం చేస్తున్నాడు.

కొద్ది రోజుల్లోనే నారు ఏపుగా పెరిగింది.

పొలం బాగుచేసీ, దున్నించీ, కూలీల్ని తీసుకువచ్చి వంగతోట వేశారు.

ఇప్పటికి వంగతోట వేసి 15 రోజులు.

మే నెల. ఎండలు ఎక్కువగా ఉన్నాయి. వంగతోట వాడిపోతోంది.

వంగతోటకి నీళ్ళు పెడదామని సోమయ్యని రమ్మని తాము కుటుంబసమేతంగా వచ్చారు.

సోమయ్య నీళ్ళ ఇంజన్లు రిపేరుచేస్తుంటాడు. సొంతంగా రెండు నీళ్ళ ఇంజన్లు ఉన్నాయి. వాటి విషయం అయనకి బాగా తెలుసు.

అంతకు కొద్దిరోజుల ముందు సోమయ్యని వెంట పెట్టుకుని వెళ్ళిపాత నీళ్ళ ఇంజను ఒకటి కొనుక్కువచ్చాడు.

* * *

"బోదెలు చేయడం అయిందంట మావా!" సైకిలు వేసుకుని వచ్చిన సోమయ్య అడిగాడు.

"ఎప్పుడో చేశామబ్బాయి. ఇంక పనేంలేదు. నీదే ఆలస్యం, ఇంజను సాగిచ్చడమే!" తొలిరోజని బావికి ఒకటీ, ఇంజనుకు ఒకటీ, పొలానికి ఒకటీ కొబ్బరికాయలు కొట్టారు.

సోమయ్య ఇంజను సాగించాడు.

జలజలా, గలగలా పొలానికి నీళ్ళు పారుతున్నాయి.

ఇంజను గొట్టంలోనించి వచ్చే నీళ్ళకు చేతులు అడ్డుపెడుతూ, తడుస్తూ, ఆడుతూ పాడుతూ పిల్లలు కేరింతలు కొట్టడం ప్రారంభించారు.

"వస్తానమ్మా! ఇంటి దగ్గర పని ఉంది" కొద్దిసేపు తరువాత రత్తమ్మకి చెప్పి కదిలాడు సోమయ్య.

"ఉండన్నా, పొంగలి చేస్తున్నా! అయిపోవచ్చింది. ఒక ముద్ద తినిపోదు ఉందు"

"ఎందుకమ్మాయి ఈయన్నీ?"

"చేలో దేవుడికి పొంగలి పెట్టుకుంటే చేను సంతోషపడి ఎక్కువ పంట ఇచ్చిద్దంటన్నా!"

"అట్టయితే అందరూ పనీ పాటా చేయకుండా పొలాల్లో పొంగళ్ళు పెడతా కూర్చోరూ"

పొంగలి చేస్తూ వంగతోట బాగా పండాలని దేవుడ్ని చాలాసార్లు తలచుకుంది రత్తమ్మ.

గొట్టంలోనించి వచ్చే నీటితో కాళ్ళూ చేతులూ కడుక్కుని, ఆకుల్లో రత్తమ్మ వడ్డించగా అందరూ సుష్టుగా భోంచేశారు.

* * *

చూపులకే కడుపు నిండిపోయేలా వంగతోట ఉంది.

రోజు రోజుకీ ఏపుగా, నవనవలాడుతూ పెరుగుతోంది.

కింద నీరు పెట్టిన పదును ఉంది. పైన మంచి ఎండలు కాస్తున్నాయి. సత్తవ ఉంది. ఇక మొక్కకి కావాల్సిందేం ఉంది?

వంగకి పురుగూ, తెగుళ్ళూ రెండు ఎక్కువే! వాటిని అరికట్టడానికి అద్దె పవర్ స్ప్రేయర్లతో రోజు విడిచి రోజు మందుకొట్టిస్తున్నాడు. మార్కెట్లో వంకాయలకి రోజురోజుకీ ధర పెరిగిపోతున్నది.

మంచి దిగుబడి రావాలని మందు విషయంలో ఏమాత్రం వెనుకంజ వేయకుండా ఎక్కువ మందు కొట్టిస్తున్నాడు.

వంగచెట్టు వంగిపోయేలా మొగ్గ వచ్చింది. విపరీతంగా వచ్చిన ఆ మొగ్గని చూసి ఆనందపడిపోతున్న సమయంలోనే గుండె గుభేల్ మంది.

పచ్చి మిరపకాయల పరిమాణంలోనే వంకాయలు ఉంటున్నాయి. అంతకుమించి కాయ ఎదగడం లేదు. నాలుగో రోజుకే ఆ కాయ కూడా రాలిపోతోంది.

ఏమైంది? ఎందుకిలా జరుగుతోందో బసవయ్యకి అర్థం కాలేదు.

మార్కెట్లో పది కేజీల వంకాయలు 160 నుంచీ 180 రూపాయల ధరకి కొంటున్నారు.

ధరని చూసి ఒకవైపు ఆశ! తన తోటని చూసి మరోవైపు నిరాశా, దుఃఖం!

మూడేళ్ళనించీ వంగతోట వేస్తూ అనుభవంతోపాటు డబ్బు కూడా సంపాయించిన రామ్మూర్తి వెంటే తను టౌనుకి వెళ్ళి అతనితోపాటే తను కూడా విత్తనాలు కొనుక్కు వచ్చాడు.

అతని పొలం ఎలా ఉందో చూద్దామని బసవయ్య వెళ్ళాడు.

రామ్మూర్తి నెత్తిమీద చేతులు పెట్టుకుని దిగాలు పడి కూర్చున్నాడు.

"మునిగి పొయ్యాం బసవయ్యా! మొగ్గ కాయ కావడం లేదు. ఒకటీ అరాకాయ అయినా అది మూడో రోజుకే రాలిపోతోంది. మీది గూడా ఇట్నే ఉందిగా!"

"మాది గూడా ఇంతే! సరే మీది ఎట్టఉందో చూద్దామని వచ్చా రామ్మూర్తీ! తెగులు ఏమన్నా సోకిందేమోనని మందులు కూడా నాజారకుండా యేసినా ఏం ఫలితం కనపళ్ళా!"

"తెగులు కాదూ, పాదూ కాదూ! ఇత్తుల్లో తేడానే ఇది. మనతోపాటు వంగతోట యేసినోళ్ళు ఇప్పటికి రెండు వరసల కాయ మార్కెట్‌కి తీసకపోతిరి. మనకి అతీ గతీ లేకపాయె! ఇంక ఇది పండదు! ఇప్పుడు కాయకి అసలు ఏం రేటు వచ్చిందీ!"

"రేపు పోయి ఆ యిత్తనాల కొట్టోడ్ని అడిగి వద్దాం, ఏందిరా ఈ పని చేశావని?"

"పోదాం బసవయ్య... పోయి తేల్చుకుందాం!" అన్నాడు రామ్మూర్తి.

ఇద్దరూ కలిసి మరుసటి రోజు టౌన్‌కి వెళ్ళి విత్తనాల షాపు అతన్ని కలిశారు.

"నిజమే, విత్తనాల్లోనే ఫాల్ట్ జరిగిందండీ! ఇప్పటికి చాలామంది వచ్చిచెప్పారు. కూరగాయల విత్తనాలకి ఆ కంపెనీ పెట్టింది పేరు అని మీకూ తెలుసుగా! మొత్తానికి ఎక్కడో తేడా జరిగిపోయింది!"

"ఇప్పుడు మా పరిస్థితి ఏమిటి?" రామ్మూర్తి గట్టిగా అడిగాడు.

"నన్ను ఏం చేయమంటారండీ? నేనూ మీలాంటి వాణ్ణే గదా! నాకు మాత్రం ఏం తెల్సు ఇట్ట జరిగిద్దనీ... కంపెనీ వాళ్ళకి రాశాను. వాళ్ళు వచ్చి ఏం చెబుతారో సమాధానం! వాళ్ళు రావాలి గదా!" అన్నాడు అతను వినయంగానూ, మర్యాద గానూ.

"ఇప్పుడు ఉన్న వంగతోట పీకేసి మళ్ళీ నాటుకోవాల్సిందే గదా! ఎంత దండగ పడ్డాం. ఇప్పటిదాకా వేసిన మందులు అన్నీ వ్యర్థమేగా!" బాధగా అన్నాడు రామ్మూర్తి.

"ఒక్క మందులేంది రామ్మూర్తీ! సత్తవలేందీ, సేద్యంఏందీ, యిత్తులు ఏందీ, ఇంజనుకి పోసిన ఆయిల్ ఏందీ, కూలీ నాలీ ఏందీ, మన చాకిరీ ఏందీ అంతా దండగేగా! - అసలు బాగుంటే ఇప్పుడు ఎంత డబ్బు వచ్చి ఉండేదో!" అన్నాడు బసవయ్య కూడా విచారంగా.

వంగతోట పీకించాలని నిర్ణయం తీసుకుని బసవయ్య చేలోకి కూలీల్ని తీసుకుపోయాడు.

తను పెట్టిన సత్తవలకి మనిషి ఎత్తు పెరిగింది తోట.

నవనవలాడే మొక్కల్ని కూలీలు పీకుతోంటే బసవయ్యకి కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

పసిబిడ్డని పెంచినట్లు అపురూపంగా పెంచాడు మొక్కల్ని. ఎంతో శ్రద్ధతో మొక్కల సంరక్షణ చేశాడు.

చివరికి ఫలసాయం పొందకుండానే పీకాల్సి వచ్చింది.

వంగచెట్లని పీకటం, వాటిని బైటకి తీసుకుపోయి వేయటం, మూడు రోజులు పట్టింది. ఈ పనికి చాలా కూలీ అయింది బసవయ్యకి.

పొలాన్ని తిరిగి దున్నించాడు. వెంటనే వంగతోట వేసుకుందామని, పొరుగూరులో వంగనారు అమ్ముతుంటే తెచ్చి మళ్ళీ మొక్కలు నాటాడు.

పోయిన నష్టం కూడా రాబట్టుకుందామనే ఉద్దేశంతో వంగతోటనే కాపురం చేసుకున్నాడు.

కలుపు రాకుండా, పురుగు పడకుండా, తెగులు సోకకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా చేసుకుంటూ నిద్రాహారాలు మరచి వంగతోటే ధ్యాసగా గడిపాడు.

శ్రమ ఫలించింది. వంగతోట విరగపండింది.

కాయ కోత మొదలుపెట్టారు.

మార్కెట్‌లో రోజురోజుకీ ధర తగ్గడం మొదలైంది.

బసవయ్య మొదటికోత కాయ మార్కెట్‌కి తీసుకుపోయినప్పుడు 10 కేజీల కాయ 50 రూపాయల ధర పలికింది.

పర్లేదు, కనీసం ఈ ధర అయినా నిలకడగా ఉంటే బాగుండు అనుకున్నాడు.

అయితే ఆ ఆశ నెరవేరలేదు. ధర తగ్గడం ఆగలేదు.

నడి వరుసకాయ చాలా కోతకి వచ్చింది. ఆ కాయ అంతా కోయించి మార్కెట్‌కి తీసుకువచ్చాడు.

అప్పటికే మార్కెట్లో చిల్లరగా కేజీ వంకాయలు రూపాయిన్నరకి అమ్ముతున్నారు. తను తీసుకుపోయిన కాయలకి 10 కేజీలు 8 రూపాయల ధర వేశారు.

బసవయ్యకి ఏడవాలనిపించింది! దిగమింగుకున్నాడు. కళ్ళంట నీళ్ళు ఒక్కటే తక్కువ!

తనకి చార్జీలూ, బస్ లగేజీ చార్జీలూ, బస్టాండు నించి మార్కెట్‌కి తీసుకుపోయినందుకు రిక్షా బాడుగల వరకూ వచ్చాయి.

ఇక కాయకోత కూలి దండగ పడ్డాడు.

దిగులు పడుతూ, విచారపడుతూ ఇంటికి చేరుకున్నాడు.

ముమ్మరంగా కాయ వచ్చిన కాలంలో రేటురాలేదు. చివరి వరుస కాయలు తీసుకుపోయినప్పుడు మాత్రం కేజీ నాలుగు రూపాయల ధర వేశారు.

పంట అయిన తరువాత లెక్కవేస్తే వంగతోట మీద ఆదాయం లేదు. మొదటిసారి వేసిన వంగతోట నష్టం కూడా పూడింది. తను రెండు సార్లు పెట్టిన పెట్టుబడికీ, వచ్చిన రాబడికీ సరిపోయింది. కుటుంబ ఖర్చులు మాత్రం అప్పులు అయ్యాయి.

మొదట్లో వేసిన వంగతోట కాపు కాసి ఉన్నట్లయితే తను వేసిన ఎకరాకి కనీసం 60 వేలు మిగిలి ఉండేవి. బావికి చేసిన అప్పు తుడిచిపెట్టుకుపోవడమే గాకుండా చేతిలో డబ్బు నిలవతో ఉండేవాడు.

ఆ అదనులో తనతోపాటు వంగవేసిన వాళ్ళందరికీ అలాగే డబ్బులు మిగిలాయి. అప్పుడు వంకాయలకి గిరాకీ అలా ఉంది.

విత్తనాల వలనే తను ఇంత దండగ పడ్డాడు. అవే గనుక మంచి విత్తనాలు అయితే తన పని ఎంత బాగుండేదో!

బావి కోసం చేసిన అప్పూ, దానికి వడ్డీ, కుటుంబ ఖర్చు మొత్తం లెక్క చూస్తే 30 వేలుకి బాకీ తేలాడు బసవయ్య.

* * *

మళ్ళీ పైర్లు వేసే అదును వచ్చింది.

ఎండి బీటలు వారిన నేలతల్లిని తొలకరి పలకరించటంతో పులకరించి పోయింది.

కాడి, మేడి, గొర్రు, జడ్డిగం సరిచేసుకుని రైతులు ఆనందంగా పనులు ప్రారంభించారు.

"అర ఎకరం అయినా వంగతోట వేద్దామయ్యా" రత్తమ్మ భర్తతో అంది.

ఆమె రెండు నెలలనించీ భర్తతో అదే విషయం మొరపెట్టుకుంటోంది.

"నిజమేనే! వంగతోట వేద్దాం. నిరుటి మాదిరిగా అయితే? ఇప్పుడు ఉన్న అప్పే మనకి తలకి మించిన భారం!"

"దండగ రాదయ్యా!"

"రాదు, నిజమే! ధరలు ఉండకపోతే! ఈ ధరలు నిలకడగా ఉండెయ్యి కాదు. పచ్చి సరకు. నిలువ ఉంచుకునేది కాదు. ఎందుకూ పనికి రావు. ఏ మాత్రం తిరుగుడు పడినా ఉన్న పొలం అమ్ముకోవాలి. బిడ్డల నోటికాడ కూడు తీసినవాళ్ళం అవుతాం. అంత పని ఎందుకు? వస్తే తినే వాళ్ళమే కానీ, పోతే ఏమయిద్ది మన పని? కీడెంచి మేలెంచాలి!" అని నచ్చచెప్పాడు బసవయ్య.

తన పొలం మొత్తం పత్తి పంట వేద్దామని నిర్ణయించుకున్నాడు.

అంతకు ముందు ఏడాది చాలా కొద్ది మంది పత్తి వేస్తే వాళ్ళకి బాగా డబ్బు మిగిలింది. ఆ ఆశతో ఈ ఏడాది చాలా మంది పత్తి పంట వేయడానికి సిద్ధమయ్యారు.

ఆ సమయంలోనే ఊళ్ళోకి పత్తి విత్తనాల కంపెనీ జీపు వచ్చింది.

సందకాడ సెంటర్‌లో మీటింగ్ పెట్టి తమ కంపెనీ విత్తనాలు ఎంత నాణ్యమైనవో, ఎంత అధిక దిగుబడి వస్తుందో మీటింగ్‌లో వివరించి చెప్పారు.

ఇతర కంపెనీల విత్తనాలు ఎకరానికి పదినించి పన్నెండు క్వింటాళ్ళ దిగుబడి వస్తే, తమ కంపెనీ కొత్తగా రూపొందించిన 'వైట్‌గోల్డ్' అనే ఈ విత్తనం పదిహేను నుంచీ పదిహేడు క్వింటాళ్ళ దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు రైతులకు చెప్పారు.

ఇవే విత్తనాలు గడచిన ఏడాది కొన్ని గ్రామల్లో రైతులు నాటుకుని ఎంత ఎక్కువ దిగుబడి సాధించి లాభపడ్డారో వర్ణించి చెప్పారు.

ధర మాత్రం ఇతర కంపెనీ విత్తనాల కంటే కేజీ రెండు వందల రూపాయలు ఎక్కువ.

వైట్‌గోల్డ్! తెల్లబంగారం! ఇంటినిండా పత్తి నిండటమే కాదు, వచ్చిన లాభాలతో కోరినంత బంగారం చేయించుకోవచ్చని రైతన్నలు భావించారు.

బసవయ్య కూడా ఆ విత్తనాలు వేయాలనుకున్నాడు.

"కేజీకి రెండు వందల రూపాయలు ఎక్కువ అంటే మాటలా? యిత్తులకే చాలా డబ్బు అయిద్ది గదయ్యా!" అంది రత్తమ్మ.

"అయితేనేమే, రేపు రెండు క్వింటాళ్ళు ఎక్కువ దిగుబడి వస్తే రెండు రెళ్ళు నాలుగు వేలు రావూ? ఇప్పుడు రెండు వందల దగ్గర చూసుకుంటే ఎట్టా?" అన్నాడు బసవయ్య.

ధర ఎక్కువ అయినా వైట్‌గోల్డ్ విత్తనాలు కొనుక్కు వచ్చి పొలంలో నాటారు.

రోజులు జరుగుతున్నాయి. వాతావరణం బాగుంది. వర్షాలు బాగున్నాయి. పత్తితోటలు కూడా బాగున్నాయి!

తనకి దాదాపు 30 వేలు బాకీ ఉంది. దానికి వడ్డీ రోజు రోజుకీ పెరిగి పోతున్నది.

వడ్డీ... పెరగడం తప్ప తరగడం ఉండదు. ముందు బాకీ తీర్చుకోవాలి.

బసవయ్య ఆశలూ, ఆకాంక్షలూ, కోరికలూ అన్నీ పొలం మీదనే!

పొలంలో పంట బాగా పండితేనే తనకి బాకీలు పోతాయి.

పత్తికి పురుగు పడకుండా మందులు వేసుకుంటూ జాగ్రత్తగా చేస్తున్నాడు.

ఇంతలో రైతుల్లో ఒక్కసారిగా హాహాకారాలూ, ఆర్తనాదాలూ!

వైట్‌గోల్డ్ రోల్డ్‌గోల్డ్ అయింది!

పత్తి మొక్కలు చక్కగా పెరగడమే కానీ, పూత, మొగ్గ, పిందె, కాయ ఏం లేదు. చెట్లు మాత్రం ఏపుగా పెరిగిపోతున్నాయి.

రత్తమ్మా, బసవయ్యా ఇద్దరూ ఆందోళన చెందారు. ఇప్పటికే తాహతుకి మించిన బాకీ అయింది. ఈ పత్తి కారణంగా మరికొంత అప్పులో పడ్డారు. తెల్సిన ప్రతి వాడ్నీ బతిమాలీ, వాడి కాళ్ళా వేళ్ళా పడి కొత్త అప్పులు చేయాల్సివచ్చింది. అదీ ఎక్కువ వడ్డీలకి.

పత్తి పంట వేసి 80 రోజులు కూడా దాటింది.

పైరు పచ్చన, పంట పల్చన! చెట్టుకి ఎక్కడో రెండు మూడు కాయలు.

వైట్‌గోల్డ్ వేసిన కొందరు దాని మీద ఆశ వదులుకుని, పీకి పారేసి వేరే పైర్లు పెట్టుకుంటున్నారు.

"మనం గూడా పత్తి చెడగొట్టి ఇంకో పైరు ఏసుకుందామయ్యా! మానులు పెరిగినట్లు చెట్లు పెరిగినా ఏం లాభం? పూతా, కాయా ఏం ఉందీ? ఇంకో పైరు యేసుకుంటే కర్చులన్నా వస్తయ్యి" అంది రత్తమ్మ.

"కానీయ్, చూద్దాం! నిరుడు వంగపీకి మళ్ళీ నాటుకుని ఏం తిన్నాం? ఇప్పుడు చెడగొట్టి ఇంకో పైరు ఏసుకున్నా అది కాసిద్దని నమ్మకం ఏముంది?"

కొంత అయినా వస్తుందనే నమ్మకంతోనే వాళ్ళు పత్తి పైరు చెడగొట్టకుండా ఉంచారు.

చివరికి ఎకరానికి రెండున్నర క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. పురుగు మందుల కొట్లోబాకీ వరకైనా రాలేదు.

వేరే కంపెనీల విత్తనాల వేసుకున్న వాళ్ళకి బాగానే డబ్బులు వచ్చాయి.

వాళ్ళ ఊళ్ళోనే వైట్‌గోల్డ్ విత్తనాలు నాటిన ఒక రైతు అప్పులు పెరిగి, అవి తీరేదారి దొరక్క పురుగు మందు తాగితే ఆస్పత్రిలో చేర్చారు.

"నిరుటికి నిరుడూ, ఇయ్యేటికి ఇయ్యేడూ ఎంత చాకిరీ చేసామయ్యా! మనం చేసిన చాకిరీ  అంతా మట్టి పాలయ్యింది. మాయదారి యిత్తుల గుండా మునిగిపొయ్యాం!" అని బావురుమంది రత్తమ్మ.

"ఏం చేస్తాం, ఏడవ్వాకు! కాలం కలిసి రాకపోతే తాడే పామై చుట్టుకునిద్ది! మనం ఎంత జేగర్తగా చేసుకున్నా మన చేతిలో ఏముంది? అంతా కంపెనీల వాడి చేతిలోనే ఉంది. మన బతుకులు గాల్లో దీపాల్లాంటివి. దిక్కుమొక్కు లేదు" అని రత్తమ్మని ఓదార్చాడు.

బాకీ పెరుగుతుందనే ఉద్దేశంతో అవి తీరడానికి బసవయ్య ఎద్దులూ, బండీ అమ్మాడు.

అయినా ఇంకా బాకీ ఉంది.

మిగతా బాకీల వాళ్ళకి పొలం రెండు సంవత్సరాల పాటు కౌలుకి ఇచ్చాడు.

ఇక చేసేది లేక ఆ రైతు చిన్న కొడుకుని కూడా వెంట పెట్టుకుని కుటుంబ సమేతంగా కూలి పనులకి పోవడం మొదలుపెట్టాడు.

ఈనాడు ఆదివారం - **24** సెప్టెంబర్ **2000**